క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌ను కలిసిన రాజీవ్‌గాంధీ



మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కొండా రాజీవ్‌గాంధీ మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిశారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ మత్స్యకార భరోసా ఇవ్వాలి



మత్స్యశాఖ జేడీ విజయకృష్ణకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మహారాణిపేట: అర్హత ఉన్న వారందరికీ మత్స్యకార భరోసా ఇవ్వాలని విశాఖ కోస్టల్ మర పడవల సంఘం అధ్యక్షుడు బర్రి కొండబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. మత్స్యకార భరోసా నుంచి 2061 మంది పేర్లు తొలగించారని ప్రచారం జరుగుతోందని, దీని వల్ల మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జేడీని కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు చీకటి రమేష్, వాసుపల్లి దాసు, సురపతి దాసు, ఎం.రాజా తదితరులు ఉన్నారు.

ఘనంగా దాసరి పైడితల్లమ్మ పండగ



దాసరి పైడితల్లి అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీ, దాసరిమెట్ట ప్రాంతాల్లో కొలువైన దాసరి పైడితల్లమ్మ పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు కొలువైన ప్రాంతాలకు భక్తులు వేకువజామునే చేరుకుని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 4 నుంచి అమ్మవారి పండగ మహోత్సవాలు ప్రారంభమయ్యాయని, నిత్యం అమ్మవారికి విశేష పూజలు చేపట్టి మంగళవారం ఆఖరి రోజున ప్రధాన పండగ జరుపుకున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జిల్‌జిల్ సోడా.. గోలీ సోడా

డెబ్బైయ్యవ దశకం నుంచి దశాబ్దాల పాటు గోలీసోడాకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఏ ప్రాంతానికెళ్లినా రోడ్డుపక్క దుకాణాల్లో సిమెంట్.. మట్టి గోలాల్లో చల్లని నీటిలో ఉంచి గోలీ సోడా అమ్మకాలు జరిపేవారు. ఆర్డినరీ సోడా, నిమ్మ సోడా, కలర్ సోడా అంటూ చెక్క బండ్లపై విక్రయించేవారు. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే చాలు.. దప్పిక తీర్చడంలో గోలీసోడాయే కీలకం. ఒక్కసారిగా కనుమరుగైన గోలీసోడా ఇపుడు కొత్త రూపుతో మార్కెట్‌ను ముంచెత్తుతోంది.

- పాత గోలీ సోడాలకు కొత్త హంగులు
- అందుబాటులో వివిధ రకాల ఫ్లేవర్లు
- రుచి చూస్తున్న అన్ని తరాల వారు



అమ్మకానికి సిద్ధంగా పలు రంగుల గోలీ సోడాలు



రోడ్డు పక్క గోలీ సోడా అమ్మకాలు

అల్లిపురం: వివిధ రకాల కూల్ డ్రింక్‌లు మార్కెట్లోకి ప్రవేశించడంతో గోలీసోడా ప్రాబల్యం తగ్గింది. దీనికి తోడు రోజుకో రకం సోడా మెషీన్లు రావడం, కార్పొరేట్ సంస్థలు కూడా ప్లాస్టిక్ బాటిళ్లలో సోడాలు తయారు చేసి విక్రయించడంతో గోలీ సోడాలు కనుమరుగయ్యాయి. ఇప్పుడు అదే సోడా కొత్తదనాన్ని సంతరించుకుని మార్కెట్‌లోకి వచ్చింది. నగరంలో పలు ప్రాంతాల్లో గోలీ సోడా హబ్‌లు వెలిసాయి. వాటికి ప్రజల నుంచి కూడా మంచి ఆదరణ లభిస్తోంది. ప్రముఖ రెస్టారెంట్లలో కూడా వీటిని కస్టమర్ల కోరిక మేరకు అందిస్తున్నారు. వివిధ రకాల ఫ్లేవర్లతో మారుతున్న కాలానికి, ప్రజల అభిరుచులకు అనుగుణంగా రంగులు, హంగులు అద్దుకుంది. రూపాంతరం చెందిన గోలీసోడా రకరకాల రుచుల్లో లభిస్తోంది. నగరంలో ఇప్పుడు గోలీసోడాల అమ్మకం జోరుగా జరుగుతోంది.

రం'గోలీ సోడా'

పాత వాటికి కొత్త రూపునిచ్చి మార్కెట్లోకి వదలడం ట్రెండ్‌గా మారింది. పాత సినిమాల్లో హిట్ పాటల రీమేక్‌లు మొదలు, అనేక గృహోపకరణాలు కూడా కొత్త సాంకేతికతను సంతరించుకుని మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. గోలీ సోడాదీ అదే దారి. గతంలో గోలీసోడా రుచి తెలిసిన వారితో పాటు, యువతరం కూడా వీటిని ఇష్టపడుతోంది. లెమన్, ఆరెంజ్, గ్రేప్, పైనాపిల్, స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ తదితర ఫ్లేవర్లలో అన్ని వర్గాల వారినీ గోలీసోడా ఆకట్టుకుంటోంది. పూర్వం 10 పైసల నుంచి ప్రారంభమైన గోలీసోడా రూ.1 వరకూ అమ్మకాలు జరగ్గా.. ప్రస్తుతం మార్కెట్‌లో కొత్తగా వచ్చిన గోలీసోడా రూ.10 నుంచి రూ.50 వరకు అమ్ముడవుతోంది. గతానికంటే భిన్నంగా ఇప్పుడు ఫ్రిజ్‌లో పెట్టిన చిల్డ్ గోలీసోడా తాగుతూ యూత్ చిల్ అవుతోంది.

ఆ సౌండే వేరు..

గోలీసోడా.. ఆ పేరే ఓ ఎమోషన్. గోలీసోడా కొడుతుంటే వచ్చే సౌండ్ వినడం భలే మజా. ఎంత గట్టిగా సౌండ్ వస్తే.. అంత గొప్పగా సోడా ఉంటుందన్న నమ్మకం. పాత తరంలో పిల్లలు, పెద్దలు కూడా గోలీసోడాకు దాసులేనంటే అతిశయోక్తి కాదు. కార్పొరేట్ కూల్‌డ్రింక్స్ మార్కెట్లో రంగ ప్రవేశం చేశాక గోలీసోడా కనుమరుగయింది. ఇపుడు స్టార్టప్‌ల ద్వారా కార్పొరేట్ రంగులద్దుకుని కొత్త రూపుతో, రకరకాల ఫ్లేవర్లతో మళ్లీ మన ముందుకొచ్చి.. తెగ సౌండ్ చేస్తోంది.

ఆ టేస్టే వేరు..



గోలీ సోడా గతంలో ఎప్పుడో తాగాను. మళ్లీ కొత్తది ఇప్పుడు రుచి చూశా. అప్పటికీ, ఇప్పటికీ తేడా సోడాలో రంగులు అని చెప్పాలి. రుచి కూడా పాతకాలం సోడాల కంటే భిన్నంగా, కాస్త గొప్పగానే ఉంది. ఏదైనా పాతదానికి కొత్తదనాన్ని తీసుకు రావడంతో గత అనుభూతుల్ని ఇప్పటి తరానికి గుర్తు చేసినట్టయింది. చాలా మంది రుచి చూసేందుకై నా తాగుతున్నారు. ఇప్పటి జనానికి రంగుల ప్రపంచం కావాలి. అందుకే వీటికి గిరాకీ ఉంటోంది. **– మొల్లేటి రాజు**

ఆదరణ పెరిగింది..



కొత్తగా వచ్చిన గోలీ సోడాకు ప్రజల నుంచి విశేష ఆదరణ దక్కుతోందనడంలో అతిశయోక్తి లేదు. వివిధ రకాల ఫ్లేవర్లలో లభిస్తున్న గోలీ సోడాలు రుచిగా కూడా ఉంటున్నాయి. ముఖ్యంగా ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో తాగితే దాహం తీరి, సేద తీరినట్టుంటుంది. హైజెనిక్‌గా తయారు చేస్తుండటంతో కూల్ డ్రింక్‌ల కన్నా గోలీసోడా తాగేందుకు మొగ్గు చూపుతున్నాం. సోడా తాగాక దప్పిక తీరి సంతృప్తి చెందిన ఫీలింగ్ లభిస్తోంది.

– సూర్య భార్గవ్

తొలగిన ట్రాఫిక్ అవస్థలు

సాక్షి ఎఫెక్ట్..

స్పెషల్ డ్రైవ్ చేపట్టిన ట్రాఫిక్ సీఐ రేవతమ్మ



ఆక్రమణలు తొలగిస్తున్న సీఐ రేవతమ్మ, ఎస్ఐ లక్ష్మి



అల్లిపురం మెయిన్‌రోడ్డులో ఆటోకు వీల్ లాక్ వేయిస్తున్న సీఐ రేవతమ్మ



ఆక్రమణలు తొలగించడంతో విశాలంగా కనిపిస్తున్న అల్లిపురం మెయిన్‌రోడ్డు

అల్లిపురం: మెయిన్‌రోడ్డులో రోడ్డును ఆక్రమించిన దుకాణదారులకు టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. రోడ్డుపై ఆక్రమణలను తొలగించారు. దీంతో అల్లిపురం మెయిన్‌రోడ్డు విశాలంగా కనిపించింది. 'అల్లిపురం మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ అవస్థలు' పేరిట మంగళవారం ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో ఎస్.ఐ లక్ష్మి, ట్రాఫిక్ సిబ్బంది సౌత్ జైలురోడ్డు బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి ఉదయం 9 గంటలకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు రోడ్డును ఆక్రమించిన దుకాణదారులకు అవగాహన కల్పించారు. రోడ్డుపై ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే రోడ్డును ఆక్రమించి నిలిపిన ఆటోలు, ద్విచక్ర వాహనాలకు వీల్ లాక్ వేసి కేసులు నమోదు చేశారు. ఇకపై ఎవరు రహదారి ఆక్రమణలకు పాల్పడరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని సీఐ రేవతమ్మ హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న చర్యలపై స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన జీవనం



పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో పాల్గొన్న డీఈవో చంద్రకళ తదితరులు

జగదాంబ: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు క్వీన్‌మేరీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో టీటీసీ శిక్షణ పొందుతున్న వారికి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడానికి అంతా కలిసి మొక్కలు పెంచి భూతాపాన్ని తగ్గించాలని తెలిపారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం సర్వశిక్ష అడిషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల వాడడంతో ప్రకృతి విపత్తులు పెరుగుతాయని, ఉష్ణోగ్రతలు ఎక్కువ అవుతాయని తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రనాథ్‌తో కలిసి అతిథులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు శుభ్రం చేయాలి



రహదారులు శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: వార్డుల్లో రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలోని వార్డుల్లో పర్యటించారు. అనంతరం ఆయన పారిశుధ్య కార్మికులు, సెక్రటరీలతో మాట్లాడారు. ప్రధాన రహదారులే కాకుండా వార్డుల్లో ఉన్న రహదారులు, వీధులు, కాలువలు శుభ్రం చేయాలన్నారు. సెక్రటరీలు తప్పనిసరిగా ఉదయాన్నే వార్డుల్లోకి వచ్చి కార్మికులతో పనులు చేయించాలన్నారు. క్లాప్ వాహనాల్లో 650 కేజీల తడి-పొడి-ప్రమాదకర చెత్త యార్డుకు వెళ్లే విధంగా చూడాలన్నారు. లేని పక్షంలో సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా కాలువల్లో చెత్త ఉండకూడదన్నారు. మురుగు నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న చెత్త, ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్ల వంటివి ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థతో సత్వర న్యాయం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ



సదస్సులో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ



హాజరైన గొరపల్లి గ్రామస్తులు

పెందుర్తి: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిరుపేదలకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మండలంలోని గొరపల్లిలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు న్యాయ సహాయం అవసరం అయితే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రతీ గ్రామాన్ని వ్యాజ్యాలు లేని గ్రామాలుగా మార్చడానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ వై.ఎస్ రంగలక్ష్మి, ఆర్ఐ సాయికిరణ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రాజు, సర్పంచ్ గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

షరతులతోనే మద్దతు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విదసం రాష్ట్ర కన్వీనర్ వెంకటరావు

ఉక్కునగరం: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా మాత్రమే ఎన్డీయేకు టీడీపీ మద్దతు కొనసాగించాలని విదసం నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం విదసం రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ, స్టీల్‌ప్లాంట్ రక్షణ, ప్రత్యేక హోదా సాధనే ప్రధాన షరతులుగా ఉండాలన్నారు. ఎన్డీయేకు టీడీపీ మద్దతు లౌకికవాదానికి ముప్పు అయినప్పటికీ బీజేపీ నుంచి ప్రమాదం జరగకుండా ఉండేలా చంద్రబాబు మద్దతు కొనసాగించాలన్నారు. ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు, ఎస్.ఆర్.వేమన, వివిధ జిల్లాల కన్వీనర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పరంధామయ్య, విళ్లా రామ్మోహన్‌కుమార్ కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1216వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికి పట్టుకొమ్మ వంటి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అలాగే వర్కింగ్ క్యాపిటల్ అందించి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలన్నారు. గత ఏడాదిన్నరగా యాజమాన్యం, ప్రభుత్వ చర్యల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి నుంచి ఉపశమనం పొందడానికి చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాస్ట్ ఫర్నేస్ కార్మికులు, నాయకులు శ్రీనివాసరాజు, సాయి నాగబాబు, వేణుగోపాలరావు, జోషి, మధుసూదనరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులతో ద్రోణంరాజు శ్రీవత్సవ్, సంస్థ అధ్యక్షుడు అప్పారావు తదితరులు

అల్లిపురం: వన్‌టౌన్ శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొన్నారు. శిబిరంలో విద్యార్థులు నెల రోజులుగా భగవద్గీత శ్లోకాలు ఆకళింపు చేసుకుని అనర్గళంగా చదివే ప్రతిభ సాధించారు. ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవత్సవ్ మాట్లాడుతూ ప్రతి వేసవిలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు భగవద్గీత, పురాణేతిహాసాలు, ఆధ్యాత్మిక యాత్రల ద్వారా భక్తి భావం పెంపొందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, విద్యార్థులు లక్ష్మి, హరిణి, నిఖిత, రక్షిత, జాహ్నవి, కీర్తి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం



త్రినాథరావు కుటుంబానికి సాయం అందిస్తున్న పట్టా రామ అప్పారావు మిత్ర బృందం

అగనంపూడి: గత నెలలో మృతి చెందిన దానబోయినపాలెంకి చెందిన డ్రైవర్ గళ్ల త్రినాథరావు కుటుంబానికి సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, ఆయన మిత్ర బృందం కలిసి రూ.16500 నగదు, నెలకు సరి పడా నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతరావు, మస్తాన్‌రెడ్డి, పిళ్లా శ్రీను, లక్కరాజు రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్!



ఆరిలోవ: ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు వచ్చేశాయి. చినగదిలి మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. వేసవి సెలవుల అనంతరం బడులు తెరిచే సరికి విద్యార్థులకు వాటిని అందించాలనే ఆలోచనతో విద్యాశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. 2024–25 విద్యా సంవత్సరానికి చినగదిలి మండలంలో పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అందుబాటులో ఉంచారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు అవసరమైన అన్ని పాఠ్య పుస్తకాలు సోమవారం ఇక్కడికి చేరాయి. వాటిని మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు తరలించాల్సి ఉంది. చినగదిలి మండలంలో 72 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో గోపాలపట్నంలో బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు అడవివరం, తోటగరువు, చంద్రంపాలెం తదితర 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 2 యూపీ స్కూళ్లు, 5 గురుకుల పాఠశాలలు, 53 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రమాదం అని తెలిసినా..



ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని రోడ్డు రవాణా సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఎంత మొత్తుకుంటున్నా చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇష్టమొచ్చినట్లు వాహనాలు నడపటం.. ర్యాష్ డ్రైవింగ్ వంటివి చేస్తూ తమ ప్రాణాల మీదకు తెచ్చుకోవడమే కాకుండా ఇతరులకు కూడా హాని చేస్తున్నారు. మంగళవారం దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం వద్ద అటువంటి సంఘటన ఒకటి 'సాక్షి' కంట పడింది. కొంత మంది యువకులు ఆటో వెనుక నిలబడి ప్రమాదకరంగా ప్రయాణిస్తూ చూపరులను భయాందోళనలకు గురి చేశారు. **- అల్లిపురం**

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలకు వినతి



డీఈవో చంద్రకళకు వినతి పత్రం అందిస్తున్న అప్సా నాయకులు

గాజువాక: ప్లే స్కూల్స్ పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) నాయకులు కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస భాస్కరరావు ఆధ్వర్యంలో నాయకులు డీఈవో ఎల్.చంద్రకళకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నగర పరిధిలోని పలు పాఠశాలల్లో ఎటువంటి అనుమతులు లేకుండా పూర్వ ప్రాథమిక తరగతులతో పాటు ప్రాథమిక తరగతులను కూడా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో కూడా నమోదు కావడం లేదన్నారు. అప్సా నాయకులు బి.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, ఫణీంద్ర పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.